‘ఉపాధి’ పనులకు ఇక్కట్లు



తాంసిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

- ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో జాప్యం
- ఉన్న వారిపై అదనపు పని భారం
- పనులపై పర్యవేక్షణ కరువు

తాంసి: గ్రామాల్లోని వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామ ప్రజలకు పని కల్పించడమే ఉపాధిహామీ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ పథకంలో భాగంగా పనుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించింది. కానీ నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించలేదు. దీంతో ఉపాధిహామీలో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బందిపై అదనపు పని భారం పడుతోంది. పాత పంచాయతీల్లో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లే కొత్త పంచాయతీల్లో పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఉమ్మడి మండలంలో 39 పంచాయతీలు..

తాంసి, భీంపూర్ ఉమ్మడి మండలంలో ప్రస్తుతం 39 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో పాత పంచాయతీలు 23 ఉండగా.. నూతనంగా ఏర్పడిన పంచాయతీలు 16 ఉన్నాయి. నూతన పంచాయతీలలో ఫీల్డ్‌అసిస్టెంట్లు లేక పాత పంచాయతీల్లో ఉన్న వారే పనులను పర్యవేక్షించాల్సి వస్తుంది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్‌కు గురికాగా.. మండలంలోని నిపాని, హస్నాపూర్ గ్రామాల్లో పనిచేసిన అనారోగ్య కారణంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మృతి చెందారు. వీరి స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. తాంసి మండలంలో 13 పంచాయతీలకు 6 గురు, భీంపూర్ మండలంలో 26 పంచాయతీలకు 10 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లు మాత్రమే పని చేస్తున్నారు. దీంతో ఉపాధి పనులు సజావుగా సాగడం లేదు.

కూలీల సంఖ్య పెంచడం ఎలా?..

జాబ్‌కార్డు కలిగిన వారందరికీ 100 రోజుల పని కల్పించాలి. ప్రతీ రోజు కూలీల సంఖ్య పెంచాలి. నిరంతరం పనుల పర్యవేక్షణ, కూలీల వేతనాలు సైతం సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవడం ఫీల్డ్ అసిస్టెంట్ల పని. కానీ రెండు, మూడు పంచాయతీలకు ఒక ఫీల్డ్ అసిస్టెంటు, సీనియర్ మేట్‌ల ద్వారా పనులు చేయించడం ఇబ్బందిగా మారింది. కొన్ని చోట్ల సీనియర్ మేట్‌లకు అప్పగించడంతో వారు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి



గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే నియమించాలి. అదనపు బాధ్యతలు చేపట్టిన వారికి అదనంగా వేతనాలు చెల్లించాలి. పని చేస్తున్న ప్రదేశాలలో సైతం వసతులను కల్పిస్తే కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.

– శ్రీహరి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

కొత్త గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియమాకం విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం కొత్త పంచాయతీల్లో సీనియర్ మెట్‌లను, ఫీల్డ్ అసిస్టెంట్లకు అనుసంధానంగా పనులు చేయిస్తున్నాం.

– ఆకుల భూమయ్య, ఎంపీడీవో, తాంసి

అటెన్షన్ ప్లీజ్.. సమస్యల్లో రైతువేదిక



నేరడిగొండ: మండల కేంద్రంలోని రైతువేదిక భవనాన్ని రూ.22 లక్షలతో నిర్మించారు. మరుగుదొడ్లు అసంపూర్తిగా నిర్మించడంతో పాటు భవనం లోపల 6 ఫ్యాన్లు బిగించారు. అయితే ఫ్యాన్లు తిరగకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లు వినియోగంలో లేవు.

అధికారి పేరు: బిర్రు భాస్కర్, మండల వ్యవసాయాధికారి, ఫోన్: 72888 94037

క్లుప్తంగా

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి గోడం నగేశ్ అన్నారు. సోమవారం మండలంలోని పిప్రి గ్రామంలో కోరెంగా వారి పెళ్లి వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు వరంలా మారాయన్నారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, ఎంపీటీసీ కోరెంగా సులోచన, బీఆర్ఎస్ నాయకులు కనక తుకారం, కనక హనుమంత్‌రావ్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి శివాజీ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని మదర్స్‌కేర్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈనెల 14 నుంచి 20వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బిల్లులు చెల్లించాలి

బోథ్: బోథ్ మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా 2020లో ప్రజలు నిర్మించుకున్న 106 మరుగుదొడ్లకు బిల్లులు చెల్లించలేదని కాంగ్రెస్ నాయకులు షేక్ నాసర్ అహ్మద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పేదవారు అప్పు తెచ్చి నిర్మించుకున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి బిల్లు రాలేదన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు.

కళా జాతరకు ఆహ్వానం



ఆహ్వానం అందజేస్తున్న కళాకారులు

ఇచ్చోడ: ఈనెల 22న నిర్వహించే ఆదివాసీ కళా జాతరకు రావాల్సిందిగా ఎంపీపీ ప్రీతం రెడ్డి, ఎంపీడీవో రాంప్రసాద్‌లను ఆదివాసీ కళాకారులు సోమవారం ఆహ్వానించారు. ఆదివాసీ కళా సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ.. అంతరించి పోతున్న ఆదివాసీ కళను బతికించుకునేందుకు ఈ కళా జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చాహకటి రాములు, ఆనంద్, మాధవ్, సునీత, నాగుబాయి, జ్యోతి పాల్గొన్నారు.

సీపీఆర్‌తో గుండెపోటు మరణాలు తగ్గించవచ్చు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఇంద్రవెల్లి: సీపీఆర్ ద్వారా గుండెపోటు మరణాలను తగ్గించవచ్చని సీపీఆర్ శిక్షణ జిల్లా అధికారి కుడిమెత మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఇంద్రవెల్లి, పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ని వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. గుండెపోటుకు గురైన వారికి ఆలస్యం చేయకుండా సీపీఆర్ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు సీపీఆర్ సెక్షన్ అధికారి ప్రతాప్‌నాయక్, అదనపు డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్, మండల వైద్యాధికారి శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు చెల్లించి రాయితీ పొందాలి



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

బోథ్: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని ఏడీసీసీ బ్యాంకు అధికారి రాజేందర్ అన్నారు. సోమవారం బోథ్ వ్యవసాయ కమిటీ మార్కెట్ రైతులకు ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందం సభ్యులతో అవగాహన కల్పించారు. రైతు రుణాలు, డిపాజిట్ పథకాలు, ఇన్సూరెన్స్ పథకాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో నాగభూషణ్, స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తలమడుగు: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండలంలోని కుచులాపూర్ గ్రామంలో కమ్యూనిటీ షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం రూ. 10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్ని కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేశ్, అధికార ప్రతినిధి మొట్టే కిరణ్‌కుమార్, సర్పంచ్ దేవరావ్, జీవన్ రెడ్డి, కరాడ్ బ్రహ్మానంద్, మగ్గిడి ప్రకాష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

తాంసి: తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సదానంద్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, శ్రీధర్ రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ రాథోడ్ రవీందర్

ఇచ్చోడ: ఉపాధి హామీ పనులు మరింత వేగవంతం చేయాలని ఏపీడీ రాథోడ్ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగామలో ఉపాధి పనులను పరిశీలించారు. ప్రతీ కూలీ వంద రోజుల పాటు పనులు చేసే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సూర్యప్రకాశ్, ఏపీవో నరేందర్, టీఏ సుజాత, నిమ్మల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నేరడిగొండ: స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్‌లు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ ఫేస్– 2లో భాగంగా పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, మహిళ సమాఖ్య వీవోఏలు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చే శిక్షణను జిల్లా సమాఖ్య మహిళా అధ్యక్షురాలు వనజతో కలిసి సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయడానికి స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో శోభన, సర్పంచ్ పెంట వెంకట రమణ, స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్ జాదవ్, శిక్షకులు సందీప్ రాథోడ్, జావిద్ అన్వర్, ఎంఈవో భూమారెడ్డి, మండల వ్యవసాయాధికారి బిర్రు భాస్కర్ పాల్గొన్నారు.

సన్మానం



సభ్యులను సన్మానిస్తున్న బలరాం జాదవ్

తలమడుగు: మండల బీసీ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను సోమవారం తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సన్మానించారు. బీసీల ఐక్యత చాటేందుకు నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. బీసీ సామాజిక కులాల సంక్షేమ, అభివృద్ధి దిశగా అ డుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రవికాంత్, ప్రధాన కార్యదర్శి వెంకన్న, పోచ్చన్న, స్వామి, దేవన్న, కిరణ్, రవి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన గుజరాతి గోపి, కొండవర్ రవీందర్, రిమ్స్ నర్సింగ్ కాలేజీకి పదోన్నతిపై వెళ్తున్న వెంకట రమణను వైద్యారోగ్యశాఖ ఎస్సీ, ఎస్టీ వైద్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రీనివాస్, మాతా, శిశు సంక్షేమ అధికారి విజయసారథి, రాథోడ్ బాబులాల్, భగత్ ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రాం అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులతో పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యూనుస్ అక్బాని

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మసూద్‌చౌక్ లో బెస్ట్‌ఫ్రెండ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యూనుస్ అక్బాని సోమవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, మహేందర్, రవీందర్, దాస్, ఆసిఫ్, బాబర్, శ్రీకాంత్, అజీజ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బోథ్: బజార్‌హత్నూర్ మండలంలోని బుర్కపల్లి గ్రామానికి చెందిన బస్సి జ్ఞానేశ్వర్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా.. బోథ్‌లోని ప్రగతి పాఠశాలకు చెందిన తోటి మిత్రులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నార్నూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు వైద్య శిబిరం నిర్వహించినట్లు సీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతికుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గుంజాల, కొత్తపల్లి సెంటర్ కలిపి మొత్తం 48 మంది గర్భిణులకు స్కానింగ్ చేసి, మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో నాందేశ్, సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సీహెచ్‌వో హేమ, స్టాఫ్‌నర్స్‌లు నవనీత, ఏఎన్ఎం శ్యామక, ఈశ్వరీ, విద్యారాణి పాల్గొన్నారు.

కళాజాత ప్రదర్శన

తాంసి: మండలంలోని గిరిగాం గ్రామంలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు సంక్షేమ పథకాలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. కంటివెలుగు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గజానన్, ఎంపీవో సుధీర్ రెడ్డి, కళాబృందం సభ్యులు గట్టు వెంక్రట్రావు, శంకర్, గోవింద్‌రావు, నగేశ్, నర్సమ్మ, శిరీష పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న రవిచంద్ర

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ సాగునీటి ప్రాజెక్టు పరిధిలో గిరిజన మత్స్య సహకార సంఘం ఎన్నికలను సోమవారం మండల కేంద్రంలో నిర్వహించినట్లు ఎన్నికల అధికారి రవిచంద్ర తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా నైతం రమేశ్, ఉపాధ్యక్షుడిగా వడ్డీ మారుతి, ప్రధాన కార్యదర్శిగా ఉయికే సుదర్శన్, డైరెక్టర్లుగా బుర్కే విఠల్, జాడే రమేశ్, గెడాం సుదాం, సరికుండే మహాదు, ఆత్రం బాపురావులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఎన్నికల సహాయ అధికారి మహమూద్ వ్యవహరించారు.

రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: బేల మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలంలో రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ సామ రూపేష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్ఎం జానీ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు అనుసంధానంగా ఉన్న లేఔట్‌లో 20 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేశారని ఆరోపించారు. కొత్తలే అవుట్ సృష్టించి అమ్మకాలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. అధికారులు స్పందించి ఆర్టీసీ స్థలం కబ్జా కాకుండా చుట్టూ ప్రహరీ నిర్మిచాలని కోరారు. ఇందులో నాయకులు ముత్యాల సురేశ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

జెండా తొలగించిన వారిపై..

ఆదిలాబాద్‌రూరల్: బేల మండల కేంద్రంలోని కుమ్రంసూరు, కుమురం భీం, రాంజీగోండ్, హీరాసుక్కా ఆదివాసీ మహనీయుల జెండాలను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుమ్రం సూరు యువసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్రం రాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. బేల మండల కేంద్రంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ఆదివాసీ మహనీయుల జెండాలను తొలగించి ఆదివాసీ సమాజాన్ని అవమానించారని మండిపడ్డారు. సమావేశంలో ఆదివాసీ సంఘం నేతలు టేకం సోము, కొడప జైవంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని వాంకిడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలతో పాటు అనారోగ్యం బారిన పడిన వారిని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ సోమవారం పరామర్శించారు. ఇటీవల మహ్మద్ భార్య, తోట నవీన్ తాతయ్య మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం షేక్ రఫీక్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ ఆడిగం రాజు, గ్రామస్తులు అజీజ్, రాజన్న, శ్రీను, భరత్ ఉన్నారు.

- నేరడిగొండ మండలం వాగ్ధారి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటరమణ తమ్ముడు పిస్క నారాయణ మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సోమవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ప్రహరీ నిర్మాణానికి స్థలం పరిశీలన



స్థలం విస్తీర్ణంపై ఆరా తీస్తున్న డీఈ అంజనేయులు

బేల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీ నిర్మాణం కోసం సోమవారం డీఈ అంజనేయులు స్థలం పరిశీలించారు. బస్టాండ్ చుట్టూ హద్దులు గుర్తించి, కొలతలు తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్టాండ్ స్థలం ఒకటిన్నర ఎకరంలో ఉందన్నారు. స్థలంలో అక్రమణకు గురైందిని గుర్తించామని తెలిపారు. ఈ విషయాన్ని ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్తామని, అలాగే స్థలం కబ్జా చేసిన వారికి త్వరలో నోటీసులు ఇస్తామన్నారు. జిల్లాలోని బేల, బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ బస్టాండ్‌ల ప్రహరీల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈ సాయికుమార్, ఎస్సై నగేశ్, కానిస్టేబుల్ కిష్టయ్య, సిబ్బంది ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కిట్లు అందజేస్తున్న ఏటీడీవో క్రాంతికుమార్

- ఏడీటీవో క్రాంతికుమార్

నార్నూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏడీటీవో క్రాంతికుమార్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని ఝరి ఆశ్రమ పాఠశాలలో పీఈటీ, విద్యార్థులు తమ సొంతంగా సమకూర్చుకున్న నిధులతో కొనుగోలు చేసిన కబడ్డీ, వాలీబాల్ కిట్స్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడ నైపుణ్యాలు వెలికి తీసేలా పీఈటీలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొట్నాక్ రాజేశ్వర్, వార్డెన్ రాంకిషన్, పీఈటీ కొట్నాక్ జలపత్‌రావు పాల్గొన్నారు.

సమాచారం

నేడు ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మంగళవారం నేరడిగొండ మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండలంలోని గాజిలి గ్రామానికి చేరుకుంటారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి హైదరాబాద్‌కు రాజధాని సర్వీస్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ (జేబీఎస్) వరకు మరో రాజధాని సర్వీస్ ప్రారంభిస్తున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మంగళవారం నుంచి ఏసీ సర్వీసు ఉదయం 8:30 గంటలకు ఆదిలాబాద్ నుంచి బయలుదేరుతుందని, హైదరాబాద్ జేబీఎస్‌కు సాయంత్రం 4:30 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటితో ముగియనున్న శనగ కొనుగోళ్లు

ఇచ్చోడ: వ్యవసాయ మార్కెట్ యార్డులో శనగల కొనుగోళ్లు మంగళవారంతో ముగియనున్నట్లు వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. రైతులు మంగళవారం తమ శనగలను మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి విక్రయించాలని కోరారు.